నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 12 మార్చి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## బీఐఎస్‌పై అవగాహన అవసరం


బహుమతులు సాధించిన విద్యార్థులు

బెల్లంపల్లి, మార్చి 11 : వస్తువుల కొనుగోళ్లలో నాణ్యతా ప్రమాణాలు సూచించే బీఐఎస్‌పై అవగాహన ఉండాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బీఐఎస్) ప్రతినిధులు కవిలత, జయశ్రీ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వినియోగదారుల వ్యవహారాలు, ఆహారాలు, ప్రజాపంపిణీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల క్లబ్‌లను ఏర్పాటు చేసి రాత పరీక్ష నిర్వహించారు. ఇందులో విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందించారు. ఈఈఈ విభాగం విద్యార్థులు ఎక్కువ బహుమతులు సాధించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దేవేందర్ రెడ్డి, బీఐఎస్ మెంటార్ యాదయ్య, లెక్చరర్లు రాములు, సురేశ్, రాజమల్లు, శివ ప్రసాద్, రవళి, శంకర్, నాగరాజు, శ్రీకాంత్, హర్ష, శ్రీనివాస్, మాలతి, వెంకటస్వామి పాల్గొన్నారు.

## పట్టుదలతో క్రీడల్లో రాణించాలి

### బెటాలియన్ కమాండెంట్ జమీల్ బాషా


పథకాలు సాధించిన కానిస్టేబుళ్లతో కమాండెంట్ జమీల్ బాషా

హాజీపూర్, మార్చి 11 : పట్టుదలతో క్రీడల్లో రాణించి గుర్తింపు తెచ్చుకోవాలని 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ జమీల్ బాషా పేర్కొన్నారు. ఇటీవల మహారాష్ట్రలోని నాగాపూర్‌లో జరిగిన 72వ ఆలిండియా పోలీస్ చాంపియన్ షిప్ వాలీబాల్ క్లస్టర్ (సెపక్ తక్రా)లో 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుళ్లు రాజేందర్ క్యాడ్ డబుల్ ఈవెంట్‌లో రెండు క్యాంస పథకాలు, తిరుమలేశ్ ఒక క్యాంస పథకాన్ని సాధించారు. వీరిని కమాండెంట్ జమీల్ బాష సోమవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నారాయణ దాసు, ఆర్ఎస్ఐ శేఖర్ పాల్గొన్నారు.


నంబాలలో కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు

## గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు భారీ మెజార్టీ ఇవ్వాలి
- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- మండలంలోని పలు గ్రామాల్లో పర్యటన

దండేపల్లి, మార్చి11 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, పెద్దపెల్లి పార్లమెంట్ నుండి పోటీ చేస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు భారీ మెజార్టీ ఇవ్వాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పిలుపునిచ్చారు. మండలంలోని నంబాల, మేదరిపేట, నెల్కివెంకటాపూర్ గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, వైస్ చైర్మన్ అక్కల రవి, మాజీ ఎంపీపీ బండారి మల్లేశ్, ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# కనిపించిన నెలవంక

- నేటి నుంచి రంజాన్ మాసం ప్రారంభం
- ఉపవాసాలు షురూ
- ముస్తాబైన మసీదులు



దండేపల్లి/చెన్నూర్ టౌన్/వాంకిడి, మార్చి 11: ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం ప్రారంభమైంది. సోమవారం నెలవంక కనిపించగా, మంగళవారం నుంచి ఉపవాసాలు ప్రారంభంకానున్నాయి. ఏప్రిల్11న శవ్వాల్ నెలవంక కనిపిస్తే రంజాన్ పండుగ జరుపుకుంటారు. ఈ మాసంలోనే దివ్య ఖురాన్ అవతరించిందని ముస్లింల విశ్వాసం. ఖురాన్‌లోని 30 అధ్యయాలు ఈ మాసంలోనే పూర్తి చేస్తారు. దీనినే తరావి నమాజ్ అంటారు.

### ఉపవాసం ఒక సామాజిక అంశం

ముస్లింలు 30 రోజులు ఉపవాస దీక్షలు పాటిస్తారు. దైనిక పనులు చేస్తూ కఠోర దీక్ష(ఉపవాసం-రోజా)చేస్తూ అల్లాహ్‌ను స్మరిస్తారు. పేదలు పడే ఆకలి బాధ ఎలా ఉంటుందో ఉపవాసాల మూలంగా అనుభవంలో కి వస్తుంది. రోజా అంటే కేవలం నీరు, ఆహారం తీసుకోవడమే కాదు. అన్ని రకాల చెడు కార్యాలు, అన్యాయం, అధర్మం, కామ కోరికలు మనసులోకి రానివ్వకుండా పాప క్రియల నుంచి దూరంగా ఉంటూ అల్లాహ్ స్మరణ చేస్తూ తనకు తాను అంతర్గతంగా ఆత్మ ప్రక్షాళన చేసుకోవడం.

### రంజాన్ దీక్ష ప్రాముఖ్యత-విశేషాలు

రంజాన్ ఉపవాస దీక్షలో సహర్-ఇఫ్తార్ ముఖ్యమైనవి. రంజాన్ నెలలో 30 రోజులు ఉపవాస దీక్షలు పాటించాలి. సూర్యోదయం కంటే ముందే నిర్దేశిత సమయంలో అన్నపానీయాలు తీసుకోవాలి. దీనినే సహర్ అంటారు. ప్రతి రోజూ కొన్ని నిమిషాల తేడాతో సూర్యాస్తమయంలో ఉపవాసదీక్ష విరమించడమే ఇఫ్తార్. దీక్షా సమయంలో ఎలాంటి ఆహార పానీయాలు తీసుకోరాదు. మందులు, ఇంజక్షన్లు, చివరికి నోటిలో ఊరే లాలాజలం కూడా మింగరాదు. ఇఫ్తార్‌ను ఖర్జూరా, ఇతర త్రా ఫలాలతో విరమిస్తారు.

### ఇస్లాం అంటే..

ఇస్లాం అంటే సకల చరాచర సృష్టికర్త, సర్వేశ్వరుడైన అల్లాహ్‌కు లోబడి ఉండడం అని అర్థం. ఇస్లాం పరిపూర్ణంగా అమలు చేసేందుకు ముస్లింలు 5 ముఖ్య అంశాలను పాటించాల్సి ఉంటుంది.1-ఈమాన్, 2-నమాజ్, 3-రోజా(ఉపవాస దీక్ష),4-జకాత్(ధాన ధర్మాలు)5-హజ్‌యాత్ర.

### ఉపవాసాలు ఇలా..

రంజాన్ మాసాన్ని మూడు భాగాలుగా వర్గీకరిస్తారు. మొదటి 10 రోజులు దైవ కారుణ్యానికి ప్రతీక. తర్వాత పది రోజులు క్షమాభిక్షకు ప్రతీక. చివరి పది రోజులు నరకం నుంచి విముక్తికి ఉపకరిస్తాయని మహ్మద్ ప్రవక్త అభివర్ణించారు.

### హలీం రుచులు సిద్ధం

రంజాన్ మాసంలో లభించే ప్రత్యేక వంటకం హలీం. కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కే పరిమితమైన హలీం దశాబ్ద కాలంగా జిల్లాలోని ముఖ్య పట్టణాలకు విస్తరించింది. యేటా మంచిర్యాల జిల్లా కేంద్రంతో పాటు చెన్నూర్, లక్సెట్టిపేట, బెల్లంపెల్లి, మందమర్రి పట్టణాల్లో స్టాళ్లను ఏర్పాట్లు చేస్తున్నారు. డ్రై ఫ్రూట్స్, ఫ్రూట్స్ సైతం విక్రయిస్తున్నారు. తరావి నమాజ్ కోసం మసీదుల్లో ప్రత్యేక ఏర్పాటు చేశారు. మసీదులను ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించారు.


మార్చి 7 : ఎమ్మెల్యే గడ్డం వివేక్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రేషన్ దందా వీరన్న

## బియ్యం దందాకు మీ కాంగ్రెసోళ్లు అడ్డొస్తున్నరు

- ఎమ్మెల్యే వివేక్‌ను కలిసి ఫిర్యాదు చేసిన రేషన్ దందా వీరన్న
- నాయకుల పేర్లతో సహా చెప్పిన సిరోంచ వీరప్పన్
- ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతున్న వీడియో
- హస్తం పార్టీలో కలకలం

మంచిర్యాల (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ చెన్నూర్, మార్చి 11 : 'రేషన్ బియ్యం దందాకు మీ కాంగ్రెసోళ్లు అడ్డువస్తున్నరు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వ్యవహారాలన్నీ తామే చూసుకుంటున్నమని చెబుతున్నరు. అక్రమ వ్యాపారం నడువాలంటే డబ్బులివ్వాల్సిందేనని బెదిరిస్తున్నరు.' అని మార్చి 7న సిరోంచకు చెందిన వీరన్న(వీరప్పన్).. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని కలిసి ఫిర్యాదు చేయగా, ఆ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతున్నది. చెన్నూర్ మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్‌ను రేషన్ దందా వీరన్న కలవడం హాట్ టాపిక్‌గా మారిన విషయం విదితమే. ఇటీవల వాహనాల్లో బియ్యం తరలిస్తుండగా కాంగ్రెస్ నాయకులు జాతీయ రహదారిపై అడ్డుకొని డబ్బులు డిమాండ్ చేశారని ఆయన నేరుగా ఎమ్మెల్యే వివేక్‌ను కలిసి వివరించారు. ఎవ్వరెవ్వరు డబ్బులు అడిగారో పేర్లతో సహా చెప్పడం ఆ పార్టీలో కలకలం రేపుతున్నది. ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన విషయమై పలు పత్రికల్లో కథనాలు కూడా ప్రచురితమయ్యాయి. వీరన్న ఇతర పనుల కోసం ఎమ్మెల్యే వివేక్‌ను కలిసారే తప్ప.. ఎవరిపై.. ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, ఇది బీఆర్ఎస్ నాయకుల కుట్ర అంటూ పలువురు కాంగ్రెస్ నాయకులు చెప్పుకొచ్చారు. అయితే, ప్రస్తుతం ఎమ్మెల్యే వివేక్‌ను కలిసి ఫిర్యాదు చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, మరి కాంగ్రెస్ నాయకులు ఇప్పుడేమని సమాధానం చెబుతారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.


వినతి పత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

## పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

- మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

మంచిర్యాల అర్బన్, మార్చి 11 : పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంచిర్యాల కలెక్టరేట్‌ఎదుట మధ్యాహ్న భోజన కార్మిక సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి రాజేశ్వరి, దాగం రాజారాం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సకాలంలో బిల్లులు రాకపోవడంతో ఇటు పాఠశాలలో భోజనం వండి పెట్టలేక, అటు కుటుంబాన్ని పోషించుకోలేక అష్టకష్టాలు పడుతున్నారని మండిపడ్డారు. అనంతరం డీఈవో కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, నాయకులు దూరం శ్రీనివాస్, బుచ్చన్న, లక్ష్మణ్, రఫియా, సునీత, పోసక్క, మధునక్క, వరలక్ష్మి, సరిత, విమల, జ్యోతి, లక్ష్మి, తిరుపతి పాల్గొన్నారు.

# ఉపాధికి సర్వం సిద్ధం

- 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రణాళికలు
- 40 లక్షల పని దినాలు కల్పించేందుకు ఏర్పాట్లు
- మౌలిక వసతులు, అభివృద్ధికి పెద్దపీట


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 11 (నమస్తే తెలంగాణ) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 40 లక్షల పనిదినాలను కల్పించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలో 1.23 లక్షల జాబ్ కార్డులుండగా, దాదాపు 2.52 లక్షల మంది కూలీలు ఉన్నారు. ప్రతి కూలీకి పూర్తిస్థాయిలో పనిదినాలు కల్పించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. పనుల్లో పారదర్శకత కోసం ఎప్పటికప్పుడు జియో ట్యాగింగ్ విధానాన్ని అమలు చేయనున్నారు. ప్రతిరోజూ పనుల పురోగతి, కూలీల హాజరును నమోదు చేయనున్నారు. జాబ్‌కార్డు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

### గ్రామాల్లో పర్యటించి..

గతంలోకంటే భిన్నంగా గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి.. ప్రజాప్రతినిధులను సంప్రదించి నివేదికలు తయారు చేశారు. గ్రామాల్లో ఎలాంటి పనులు కావాలో అడిగి తెలుసుకొని ప్రణాళికలు రూపొందించారు. మౌలిక వసతుల కల్పన, అభివృద్ధికి పెద్దపీట వేశారు. స్వచ్ఛత, పచ్చదనంతో పాటు భూగర్భ జలాలు పెంపొందించేలా పనులు చేపట్టనున్నారు. అలాగే ఇంకుడు గుంతలు, పొలాలు చదును చేయడం, కంపోస్టు పిట్‌లు, పండ్ల తోటలు, పశువుల పాకలు, గొర్రెలషెడ్‌లు, పాఠశాలల్లో మరుగుదొడ్లు, నర్సరీల అభివృద్ధి, పాఠశాలల్లో వంటగదులు, రైతుల చేళ్లల్లో వరద కాలువల ఏర్పాటు వంటి పనులను చేపట్టనున్నారు.

## జిల్లా అదనపు ఎస్పీగా ప్రభాకరరావు


బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రభాకర రావు

ఆసిఫాబాద్ టౌన్,మార్చి11 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా నూతన అదనపు ఎస్పీ(అడ్మిన్)గా ఆర్.ప్రభాకర రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్‌గా పని చేసిన ఆయన ఇటీవల బదిలీపై ఆసిఫాబాద్ జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు.

## అటవీ శాఖ ఉద్యోగిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

మంచిర్యాల ఏసీసీ, మార్చి 11 : మంచిర్యాలకు చెందిన ఓ అటవీ శాఖ ఉద్యోగిపై ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం దాడి చేశారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ఫారెస్ట్ డివిజన్ అధికారి కార్యాలయంలో తాటికొండ అనిల్‌కుమార్ సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి 11 గంటలకు పని ముగించుకొని మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో దిగాడు. మూడో ప్లాట్‌ఫాం నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో అక్కడే ఉన్న ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఒక్కసారిగా దాడి చేశారని అనిల్‌కుమార్ తెలిపారు. బ్యాగు లాక్కెల్లారని, అందులో వి లువైన సామగ్రి ఉన్నట్లు పేర్కొన్నారు. బాధితుడు సోమవారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.



చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ ఇంటి ముందు ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

## ఎమ్మెల్యేల ఇళ్ల ఎదుట పారిశుధ్య కార్మికుల నిరసన

### వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్

మంచిర్యాల అర్బన్, మార్చి 11 : వెంటనే వేతనాలు చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం మంచిర్యాల పట్టణంలోని మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాల ఎమ్మెల్యేల ఇళ్లముందు ఆందోళన నిర్వహించారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పారిశుధ్య కార్మికులకు వేతనాలు నెలలుగా నిలిచిపోవడంతో నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నయ్య, నాయకులు సాగర్, రాజలింగు, మల్లేశ్, సుజీత్, లక్ష్మి, రమేశ్, లింగన్న, ప్రశాంత్ పాల్గొన్నారు.



రోంపల్లి పల్లె ప్రకృతి వనంలో ఎండిన మొక్కలు


తిర్యాణి మండలం మొకాసి గూడలో ఎండిపోయిన పల్లె ప్రకృతి వనం

## కళ తప్పిన పల్లె ప్రకృతి వనాలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 11 (నమస్తే తెలంగాణ) : పల్లె ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు కేసీఆర్ సర్కారు ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు అధికారుల నిర్లక్ష్యంతో కళావిహీనంగా మారాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి జిల్లాలోని 335 గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసి, వాకింగ్ ట్రాక్‌లతో పాటు చల్లని వాతావరణం కోసం అనేక రకాల మొక్కలు పెంచింది. చిన్నారులు ఆడుకోవడానికి పరికరాలు సైతం అందుబాటులోకి తీసుకొచ్చింది. గుట్టలు, బండలపై జంతువులు, ఇతర అందమైన బొమ్మలు వేయించి అందంగా తీర్చిదిద్దింది. ఈ క్రమంలో సర్కారు మారడం.. అధికారులు పట్టించుకోకపోవడంతో మొక్కలన్నీ ఎండిపోయి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.


తిర్యాణి మండలం ఇస్రుగూడ పల్లె ప్రకృతి వనం దుస్థితి


కళావిహీనంగా కెరమెరి(హట్టి) పల్లె ప్రకృతి వనం


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్

## నిబంధనల మేరకే ధాన్యం కొనుగోళ్లు

- రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు
- జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్

నస్పూర్, మార్చి 11 : ప్రభుత్వ నిబంధనల మేరకే వరిధాన్యం కొనుగోళ్లు చేపడుతారని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వాజిద్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, జిల్లా రవాణా అధికారి సంతోష్‌కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపాల్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్లు చేపడుతుందని, రైతులు నిబంధనలు పాటించాల్సి ఉంటుందని సూచించారు. కొనుగోళ్లకు అవసరమైన గన్నీ సంచులను సమకూర్చుకోవాలన్నారు. ఏ గ్రేడ్‌రకానికి క్వింటాలుకు రూ. 2,203, సాధారణ రకానికి రూ.2183 మద్దతు ధర నిర్ణయించడం జరిగిందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.


మాట్లాడుతున్న ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

## మున్సిపాలిటీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ
- కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో బడ్జెట్ సమావేశం

కాగజ్‌నగర్ ఎస్పీయం కాలనీ, మార్చి 11: కాగజ్‌నగర్ పురపాలక సంఘ అభివృద్ధికి అధికారులు, పాలకవర్గం సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సమావేశం నిర్వహించారు. సిర్పూర్ ఎమ్మెల్యే పా ల్వాయి హరీశ్‌బాబు, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ షాహీన్ సుల్తానా, వైస్ చైర్ పర్సన్ స్వామిశెట్టి రాజేందర్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సం దర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పురపాలక సంఘ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, అందుకనుగుణంగా ముందుకెళ్లాలని సూచించారు. పురపాలక సంఘ పరిధిలో వివిధ రకాల ట్రేడ్ లైసెన్సు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.